ప్రేమ కానుక

శ్రీ పుల్లగంపల్లి గోవిందరెడ్డి

ఇరవై సంవత్సరములు గడచిపోయినవి. దట్టమైన ఆ చీకటి రాత్రిలో రైలు ప్రతి స్టేషనులోనూ ఆగుతూ పోతూవుంది. రామమూర్తి రెండవతరగతి పెట్టెలో కూర్చున్నాడు. ప్రతిస్టేషనూ పరకాయించి చూస్తున్నాడు. ఉద్యోగము వదలి చాల రోజులయింది. జీవితంలో నిరాశకు చోటివ్వకుండా నెట్టుకుపోతున్నాడు. గొప్ప వ్యాపారి. అయినప్పటికీ రెండవ పెళ్లివిషయం తలపెట్టడంలేదు. ఇరవై సంవత్సరాలముందు యాత్ర చేస్తున్నాడు. ఈరోజు వ్యాపారం చాలించి డబ్బుతో తిరిగి కలకత్తానుంచి ఇంటికి వస్తున్నాడు. చాలా అలసిపోయాడు. ఒక చిన్న స్టేషనులో తటపటాయించుకొంటూ లేచి కూర్చున్నాడు. కిటికీగుండా బైట చూశాడు. ఆ చీకటి రాత్రిలో బైటకూలీలెవరూ లేరు. స్వయంగా పరుపూ, బ్యాగు దించుకున్నాడు. అటూ ఇటూ చూచాడు. రైలుకదిలి వెళ్లిపోయింది. స్టేషను కంతటికీ వెలుతురుగా వున్న ఒక్కదీపం ఆరిపోయింది. ప్రక్కనున్న బెంచీమీద కూర్చున్నరామమూర్తి కన్ను పొడుచుకోడానికి కూడా కన్పించని ఆ చీకటిలో ప్లాటుఫారం దిగి రైలుపట్టాలు పట్టిపోతున్నాడు. నూరు నూటపది అంగలు వేసి ఆగిపోయాడు. ఆలోచించి కూర్చున్నాడు. ఇనుపపట్టాల క్రిందున్న కడ్డీస్లీపర్లను చేత్తోతడుముతున్నాడు. చూట్టూతడిమాడు. ఇరవై సంవత్సరాల్లో ఎన్నిస్లీపర్లు మారివుంటాయో, చేతికి జిడ్డు పదార్థం తగిలింది. ఇది తప్పకుండా ఇరవై సంవత్సరాల నాటి పాతరక్తమే అనుకొన్నాడు. అవి రక్తపు మరకలా లేక ఇంజను నూనె మరకలా? నలువైపులా చూచాడు. మసకదృశ్యాలు కంటే మనస్సాక్ష్యమే ఎక్కువగావుంది. ఔను ఆ స్థళం ఇదే. మోకాళ్లమీదుగ కూర్చున్నాడు. కళ్లుమూసుకున్నాడు. పాత దృశ్యం.

ఇరవైసంవత్సరాల ముందు —

ఉక్కిరిబిక్కిరిగా నిండినరైల్లో భార్యతో పాటు యాత్రచేస్తున్నాడు. రామమూర్తి ఇంతవరకూ ఏమాలోచిస్తున్నాడో ఏమో, రైలుకదిలిందనగానే - ఇంతవరకూ ఊపిరి సల్పడానికి వీలులేకుండావున్న ఉక్కమీద, ప్రక్కన్నే చమటతో గుడ్డలన్నీ తడిసిపోయి వాసన కొడుతున్న ఓ పల్లెటూరి మనిషి మీదా, ఎదురుగా కూర్చొని కిటికీగుండా బైటవైపే చూస్తూవున్న భార్యమీద చెప్పరానంత కోపమూ అసహ్యమూ వేసింది. ఎంతసేపుచూచినా భార్య కిటికీవైపే చూస్తూవుంది. ఒక్కసారయినా తనవైపు చూచిందికాని నవ్విందికానీ కాదు. నిబ్బరించుకోలేనంత ఈర్ష్య భార్యమీద పుట్టింది. ఇదేమీ కొత్త ఈర్ష్యకాదు - పాత ఈర్ష్యే.

రామమూర్తి పెళ్లయి రెండుసంవత్సరాలైంది. రెండేళ్లలోనే పెళ్లినాటిక్రొత్తదనం పాతబడిపోతుందంటే ఆశ్చర్యమేముంది? తరువాత గృహస్థజీవితం పెళ్లినాటిక్రొత్తదనమనే దానిమీద కాకుండా ఇతరవిషయాలమీద ఆధారపడినడుస్తూ వుంటుంది. భార్యాభర్తల ఒకే విధమయిన అభిప్రాయాలమీద, మాతృత్వ పితృత్వ భావాలమీద, చేతోడు వాతోడుగా కలిసిమెలసి పనిచేసిన కాలస్మృతి పథంమీద, పునాది నిర్మించుకొని గృహస్థజీవితం నిలబడివుంటుంది. రామమూర్తి జీవితానికి వీటిలో దేనిమీద ఆధారపడి నిలబడే ఆస్కారం లేకపోయింది. ఇంకా సంతానంలేదు. అర్థం దాంపత్య జీవితంలోని మమత తగ్గిపోయింది. క్రొత్తగా కాపురానికి వచ్చినప్పుడు "నా జీవిత భారాన్ని నీమీదవదలి నిశ్చింతగావుండిపోతున్నాను. ఏకాకిగా నా జీవితం గడపటం దుర్భరం, నీ వెంటవుంటే హాయిగా కాలం గడిపేస్తాను; నాకాధైర్యముంది," అన్నాడు. ఇందుమతి ఎటువైపో మొహంతిప్పి నిశ్చలంగా వింటూ వుందేకాని ప్రత్యుత్తరంగా, 'ఆ, అనిగాని ఊ,' అని అనిందికాదు. తను కోరినట్టుగా జవాబు ఇందుమతి నుండి లభిస్తుందని ఆశించిన రామమూర్తి మనసు మాడిపోయింది. దెబ్బతిని యుద్ధభూమిని విడిచి పరువెత్తేసైనికుడుగా అయిపోయాడు. మెల్లగా తన గదిలోకి వెళ్లాడు. ఆ నాటి నుండీ ఇందుమతంటే ఒక రాతిబొమ్మ అనుకొన్నాడు. హృదయంలేని స్త్రీలతో వ్యవహరించడం చాలాకష్టమనుకొన్నాడు. ఈ రెండేళ్లలోగా ఒక్కనాడు కూడా గౌరవ సూచక వాక్కు రామమూర్తి నోట ఇందుమతి వినిన పాపానపోలేదు.

రెండేళ్ల తరువాత యాత్ర తలపెట్టాడు. ఇందునుగురించేమైనా,ఇందుమతి ఉత్సాహం చూపుతుందనుకొన్నాడు అలాంటిదేమీ జరగలేదు. విగ్రహంలా వెంటవస్తూవుంది.

బండి ఆగింది. ఇందుమతి కిటికీవైపే చూస్తూవుంది. 'నాకు దాహమేస్తూవుంది' ఈమాట రామమూర్తికి పరమ అసహ్యంగా వినబడింది. అందులో ఏమాత్రమూ అవసరమున్నట్టుగాని, పట్టుదల యున్నట్లుగాని, లేదు. 'నీళ్లు లేకపోయినా కాలంగడిచిపోతుంది' అన్నట్లుంది. గొంతు దాకా వచ్చిన ఏదో ఓ మాట లోపలనే మ్రింగుతూ రామమూర్తి చెంబుతో పెట్టెదిగి వెళ్లాడు. "నాకుదాహమేస్తూవుంది నీళ్లు పట్టుకరండి" అంటే పోయిందేమి. సాధ్యమయినంతవరకూ ఆమెకు కావలసినవన్నీ చేస్తున్నానే, ఒంటరిగా యాత్రచేయలేక ఈమెవెంట తీసుక వచ్చినా, ఆమాత్రం అర్థం చేసుకోలేని మనిషి - సరిగా మాట్లాడితే నోటిముత్యాలు రాలిపోతాయా? "చదువుకొన్న భర్తకు రెండు పూటలు పొట్టనిండా రుచిగా వండి పెట్టడమే కాకుండా ఇంకా ఎన్నోపనులు చేసి పెట్టాల్సి వుంటుందనీ, భర్తకూడా రెండుపూటలు తిండేకాకుండా ఇంకా ఏదో

కోర్తాడనీ, అర్థం చేసుకోలేని పల్లెటూరి గబ్బిలాయలతో పడడం మహాకష్టం" అని గొణుక్కుంటూ పైపువద్ద కెళ్లాడు.

బండి కూసిందే తడవు బయల్దేరింది. రామమూర్తి నీటి పంపువద్ద ధక్కా మక్కీ నుండి బయటపడేలోగానే పచ్చజెండా ఆడి ముడుచుకుంది. తనుకూర్చున్న పెట్టె అందుకోలేకపోయాడు. ఇందుమతి కిటికీగుండా బయటచూస్తూవుంది. మతిపోయినట్లయింది.

బండివేగ మెక్కువయింది. ఆమె ఆవేదన ఎక్కువైంది. ఆమె హృదయం సుడిగుండంలో పడిన నావ అయిపోయింది. చెంబు చేతిలో పట్టుకొని రామమూర్తి పరువెత్తుతున్నాడు. ఒకవాకిలిదగ్గిరి ఇనుపచువ్వ పట్టుకొన్నాడు. ఎక్కడం సాధ్యం కాకపోయింది. ఇందుమతి చూస్తూనే వుంది. క్షణం పాటు ఒకదృశ్యం ఆమె కళ్లముందు నడిచి వెళ్లింది. తొట్రుపడుతున్న రామమూర్తి కాళ్లవేగం .... ఇంత వేగంగా పోతున్న రైలులో ఎక్కబోయి ... ఆమె సహించుకోలేక పోయింది. నీళ్లు ఎందుకు కావాలంటినా ననుకొంటూ తన్ను తాను దూషించుకొంటూ, ఎంతవరకూ వంగగలిగిందో వంగి కిటికీబైట చూస్తూవుంది. మరీ వంగింది. మరీ ... మరీ అంతే ఒకకాలు ఒకభుజంలో భీషణమైన అగ్ని జ్వాలిపినట్టయింది. కళ్లు మబ్బుకప్పినయి. కళ్లు తెరచినా అంధకారంగానే కన్పడింది.

రైలు చీదరించుకొంటూ ఆగిపోయింది. అనుభూతుల్తో నింప బడిన క్షుద్రచేతన ప్రపంచంలోని ఈచిన్ని ఘట్టానికీ ఏమయినా విలువయుంటుందా?

రామమూర్తి పెట్టెవద్దకొచ్చాడు. ఇందుమతిలేదు. రైలులోని జనమంతా ఒకచోట ప్రోగయ్యారు. ఇందుమతి విషయమే మరచి రామమూర్తి ఏమిటో కనుగొందామని అక్కడి కెళ్లాడు. స్థంభించి పోయాడు. రైలుచక్రాలు ఒక కాలు ఒక భుజం మీదుగా వెళ్లాయి. ఒకకన్ను లొట్టపోయింది: శరీరంలో మరెచ్చటా గాయాలు లేవు. వెంట్రుకలన్నీ తడిసి ముద్దయిపోయాయి. ఇందుమతి స్థితిచూచి రామమూర్తి శరీరం 'శిల' అయిపోయింది. కొంతచలించి ఒకకన్ను కొంత తెరువబడింది. ఎవరివైపు చూడకుంటా స్థిరంగా క్షీణస్వరంతో "నే వెళుతున్నా" అనింది. ఎవరి అనుమతినో అర్థించింది. తనకేమీ కాబట్టనట్టు రైలు వెళ్లిపోయింది. డాక్టరు వచ్చాడు. ఒకసారి ఆమెశరీరంవైపు మరోసారి రామమూర్తివైపు చూచాడు. మరో పర్యాయం తెరచియుంచబడిన ఆకన్నువైపు చూచాడు. రక్తసిక్తమయిన ఆమె పమిటతోనే ఆమె మొహం కప్పి వెళ్ళాడు.

రైలు ఆగి కదిలిపోయింది. దయా దాక్షిణ్యాలు లేని 'కాలం' రెప్పపాటయినా ఆగింది కాదు. రైలు మానవ నిర్మాణం-మానవుడు

దయాపరుడు. 'కాలం' మానవాతీతం మానవాతీత శక్తి ఎప్పుడూ నిర్దాక్షిణ్యంగానే వుంటుందేమో !

◆ ◆ ◆

ఈనాడు - రామమూర్తి తన్ను తాను ఒక ప్రేతానికి అప్ప చెప్పాడు. జీవితమంతా ఆ ప్రేతం స్వాధీనంలో వుండిపోవాలనుకొన్నాడు. కఠోర ఏకాగ్రతతో పాత దృశ్యాల్ని మననం చేస్తున్నాడు. కొంత దూరంలో ఏదో ఏడ్పు, స్త్రీకంఠస్వరం. జడిసి కూర్చున్నాడు. ఏమీ కన్పించడము లేదు శబ్దం వస్తున్నవైపు నడిచి వెళ్ళాడు. చేతులు ముందుకు చాచి వున్నాయి. ఇందుమతి ఎప్పుడైనా ఏడ్చిందా? ఏడ్చివుంటే ఆ ఏడ్పు తనకు జ్ఞాపకముండేది. ఎవరిదా ఏడ్పు !

"ఎవరక్కడ" అన్నాడు. జవాబులేదు.

"ఎవరా ఏడుస్తున్నది" అని మెత్తదనంగా అన్నాడు. పట్టాల దగ్గరగా ఒకనల్లని మబ్బు లేచింది. తటాలున మరోవైపుకు వెళ్లిపోయింది. చెట్టుదాపున మాయమయింది. మబ్బులేచినచోటుకు వెళ్ళాడు. చీకట్లో తారాడుతూ కూర్చున్నాడు. ఏదో మెత్తని పదార్థం చేతికి దొరికింది. గుడ్డల మూటలో నుంచీ కెవ్వున కేక. తడబడుతున్న చేతుల్తో మూట విప్పాడు, రక్తపుముద్ద. తడియారని శిశువు ఆపాళంగా కౌగలించుకొన్నాడు. త్వరత్వరగా స్టేషనువైపు వచ్చేశాడు. బెంచీమీద కూర్చున్నాడు. తూర్పుదిశ పటమెగిరింది. దగ్గరి పల్లెలో కోడికూసింది. ఓవర్ కోటుతీసి తొడుక్కొన్నాడు. అందులో బిడ్డనుదాచి పెట్టుకొన్నాడు.

రామమూర్తి వ్యాపారం మానేశాడు. పెద్దభవనంలో కాపురం. బాలికపేరు 'ఇందుకళ' దాసి ఆడిస్తూవుంటుంది. రామమూర్తి వరండాలో ఈజీచేరులో కూర్చొని బిడ్డవైపు చూస్తూ ఏదో ఆలోచిస్తూ వుంటాడు.

గ్రామస్థులంతా రామమూర్తి పిచ్చివాడంటారు. డబ్బు ఎక్కువగా యున్న వాళ్లుకూడా పిచ్చివాళ్లయి పోతారేమో అనే గుసగుసలు బయలుదేరినయి. 'ఇందుకళ' ఎక్కడ ఆడుకొంటున్నా 'అదో ఆపిచ్చి ముసలాడి కూతురు' అంటూ వేలుపెట్టి చూపిస్తూవుంటారు. ఇందులో చాలావ్యంగముందని రామమూర్తికి తెలుసు. ఎవరి పాపభారాన్నో రామమూర్తి మోస్తున్నాడని వూరివారందరూ అనుకొంటున్నారు. రామమూర్తి నిర్ద్వంది - హృదయంలో విశ్వాసముంది. క్షమాశీల ఇందుమతే స్వయంగా తనప్రతిబింబాన్ని రామమూర్తి చేతుల్లో పెట్టిపోయింది. ఆబొమ్మ ఇందుమతి బ్రతికుండగా బహూకరించడానికి శక్తిలేక చచ్చిన తరువాత తన ప్రేమ కానుక సమర్పించుకొంది - భర్తవల్ల తనూ పొందింది.